# ధనమదం

-రచన: కుప్పుసుబ్రహ్మణ్యం

రెడ్డి చావిట్లో కూచుని తీవిగా హుక్కా పీలుస్తున్నాడు. గంభీర వదనం, పుష్టిగల దేహం, కర్కశత్వం అతనిలో అగపడుతూంది.

ఎండలో నిలుచుని ఎంతసేపైందో! ...పాపం! ఆ అనాథ జాలిచూపులు వెదచల్లుతూ రెడ్డివాంక చూస్తూవుంది.

పై చూపుతో ఆలోచనల్లో లీనమైయున్న రెడ్డి ఇది గ్రహించలేదు.

పూజచేసి, పళ్ళెంలోని ప్రసాదంతోటి ఇవతల కొచ్చింది పార్వతమ్మ.

వీధిలో ఆడుకుంటున్న చిన్న కుర్రాళ్ళంతా ఇదిచూసి గబగబా లోనికి పరుగెత్తుకొచ్చి పార్వతమ్మను చుట్టివేశారు.

...ప్రసాదంతింటూ మామూలుగా ఆటకు జారిపోతున్నారు కుర్రాళ్ళు. ఆ అనాథ ప్రశాంతముఖం పొట్టకోసం యాచిస్తూవుంటే జాలిహృదయంగల పార్వతమ్మ హృదయం కరిగింది. గుప్పిట్లో ప్రసాదం తీస్తూవుంటే......

"ఏమది?...ఆ ముష్టిదాన్ని అవతలకి వెళ్ళగొట్టు. నువ్వివతలకి రా"

అంది రెడ్డి కఠోరస్వరం.

ఉలిక్కిపడింది పారత్వమ్మ. చేతిలోంచి జారిపడింది అప్రయత్నంగా ప్రసాద పళ్ళెం.

ఆ అనాథ వీధిలో పడిపోయిన ప్రసాదాన్ని ఏరుకుంటూవుంది......

"ఏయ్! ఆగు! ప్రసాదాన్ని ముట్టకు"

హుక్కా వదిలేసి, చేతికర్రతో వస్తూ...ఆ పేదరాలి చేతులమీదుగా పోనిచ్చాడు కర్ర!

"అమ్మా!..." అంది ఆ అనాథ.

చేతిలోని ప్రసాదం జారిపోయింది.

"వెధవముండలు. అపవిత్రులకి ప్రసాదం పంచడం తప్పు. ఇంట్లో ఆడవాళ్ళకి తెలివితేట లేపాటివే. ఊఁ......నిలుచున్నావేం? దయచెయ్యి"

అంటూ గర్జించాడు రెడ్డి.

"బాబూ! పరమాత్ముని ప్రసాదం స్వీకరిస్తే తప్పు కనిపించిందా? మనలందర్నీ పుట్టించిన ఆ భగవంతుని ప్రసాదాన్ని మేం మటుకు ముట్టడం అనర్హమా? ఇదెక్కడి ధర్మం బాబూ!..."

అంటూంది వణుకుతూ ఆ పేదరాలు.

రెడ్డికోపం అధికమైంది. ఆ అనాథ వెళుతూ...ప్రసాదం కోసం కిందికి వంగింది.

"ఛీ...పో!" అంది రెడ్డి కర్కశ కంఠం.

నలుగురూ తొక్కినడచే ఆ రోడ్డు దుమ్ములోనుంచి పవిత్ర ప్రసాదాన్ని ఏరుకోవడం ఇంతకీ ఆ పేదరాలు చేసిన తప్పు!

ధనమదం!...పేదవారిని ఉసురుపెట్టే...ఆ డబ్బు...రెడ్డివెంట వొస్తుందేమో?